యాదగిరీశుడికి కల్యాణ సేవ

సువర్ణ పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూన్10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువరాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.31,77,476 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

కలెక్టర్ హనుమంతు కె.జెండగే


ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 10 : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహించరాదని సూచించారు. వివిధ సమస్యలతో ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలరే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 40 ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి-30, మున్సిపాల్ శాఖ-5, విద్యాశాఖ-3, పోలీసు, కార్మిక శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమారి నర్సింహ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడాలన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి అండగా నిలువాలని కోరారు. ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతోపాటు ఐడీ కార్డులను రెన్యూవల్ చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, కార్మికులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

● జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

బీబీనగర్ : బడిబాటలో పాల్గొన్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి

బీబీనగర్, జూన్ 10 : బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోసం ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేయాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి అన్నారు. సోమవారం బీబీనగర్ మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఐఆర్‌పీకే సుజాత, ఉపాధ్యాయురాలు గ్రాస్ పాలినా, సీఆర్పీ బాలయ్య, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందే వసతులను వివరించే కరపత్రాలను పంచారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, బ్రహ్మచారి, అచ్చయ్య, కవిత, ప్రేమలత పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని పెద్ద పర్వతాపూర్‌లో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో బొమ్మలరామారం హైస్కూల్ జీహెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు డీవి రుషి, లక్ష్మారెడ్డి, వాణిశ్రీ, కరుణాదేవి, యాస్మిన్, సీఆర్పీ శ్రీహరి పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

● ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ఆలేరు రూరల్, జూన్10 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉత్తీర్ణత సాధిస్తున్నాయని ఆలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అధ్యాపక బృందం ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ కళాశాలలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. అధ్యాపక బృందం వెంకటేశ్వర్లు, అబ్బాస్, జితేందర్‌రెడ్డి, వెంకటరమణ, రాములు, పరశురాములు, మానస పాల్గొన్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

శ్రీనివాసపురంలో నిరుపయోగంగా ఉన్న కంపోస్ట్ షెడ్

ఆలేరు రూరల్, జూన్ 10 : గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే సంకల్పంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో డంపింగ్ యార్డులను నిర్మించింది. లక్ష రూపాయలు వెచ్చించి తడి, పొడిచెత్తను వేర్వేరుగా డంపింగ్‌యార్డులకు తరలించి అక్కడ సేంద్రియ ఎరువులను తయారుచేసి విక్రయించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ప్రస్తుత ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యంతో ఈ పథకం నీరుగారుతున్నది. మొదట్లో డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువులు తయారు చేసి విక్రయించగా కొంత మేర ఆదాయం సమకూరింది. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో డంపింగ్ యార్డులను నిర్మించారు. ప్రస్తుతం గ్రామాల్లో నిత్యం చెత్తను సేకరించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పరిస్థితి ఇలా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి డంపింగ్ యార్డులను వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బాలును ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

తుంగ బాలుకు కేసీఆర్ ఆశీర్వాదం

రాజాపేట, జూన్ 10 : తన జన్మదినం పురస్కరించుకొని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు మొక్క అందజేసి ఆయన ఆశీర్వాదం పొందారు.

పశువులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

చౌటుప్పల్ రూరల్, జూన్ 10 : చౌటుప్పల మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద పశువులను అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని సోమవారం చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లగొండ జిల్లా పీఏపల్లికి చెందిన నునావత్ కృష్ణ(29), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో 72 పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు టీఎస్ 07 యూయన్ 2210 నంబర్ గల డీసీఎంలో తరలిస్తుండగా పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా పట్టుబడ్డాడు. వాహనాన్ని సీజ్ చేసి నిందితుడు కృష్ణను అరెస్టు చేసినట్లు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

మోత్కూరు రైతు సేవా సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం వాయిదా

మోత్కూరు, జూన్ 10 : మోత్కూరు రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై పాలకవర్గం సభ్యులు పెట్టిన అవిశ్వాసం వాయిదా పడింది. గత నెల 21న అశోక్‌రెడ్డిపై సంఘం వైస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, 8 మంది డైరెక్టర్లు డీసీఓకు అవిశ్వాస తీర్మాన ప్రతిపాదన పత్రాన్ని అందజేశారు. కాగా, డీసీఓ ప్రవీణ్‌కుమార్ ఈ నెల 11న ఉదయం 11 గంటలకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ ఇప్పటికే సంఘం పాలకవర్గ సభ్యులకు నోటీసులు జారీ చేశారు. సంఘం డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు సంఘం సమావేశాలకు హాజరు కాకపోవడంతో పాలకవర్గం తీర్మానం చేసి డీసీఓకు నివేదించిన విషయం విధితమే. సహకార చట్టం సెక్షన్2(బి) ప్రకారం సభ్యత్వం కోల్పోయిన ఇరువురు డైరెక్టర్లకు అవిశ్వాస తీర్మానంలో పాల్గొనే అర్హత కోల్పోయారంటూ సంఘం చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో నేడు జరుగాల్సిన అవిశ్వాస సమావేశం వాయిదా పడినట్లు డీసీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

రఘునాథపురం విద్యార్థికి విద్యాదాత పురస్కారం

రాకేశ్‌కు పురస్కారం అందజేస్తున్న వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు

రాజాపేట, జూన్ 10 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి రఘునాథపురం జడ్పీ పాఠశాల విద్యార్థి రాకేశ్ హాజరయ్యాడు. రాకేశ్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో ఈ సందర్భంగా వందేమాతరం విద్యాదాత పురస్కారం అందజేశారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఇంటింటి సర్వే

మిషన్‌భగీరథ నీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ నిరంబన్ వలీ

ఆత్మకూరు(ఎం), జూన్ 10 : మిషన్ భగీరథ నీటి సరఫరాపై సోమవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఎంపీడీఓ నిరంజన్‌వలీ ఇంటింటి సర్వేను పరిశీలించి నీటి వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీటి వినియోగదారులు మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి ఇంటికి ఒక రోజు తప్పించి ఒకరోజు మిషన్ భగీరథ నీళ్లు సరిపడా వస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గ్రామపంచాయతీ ఉద్యోగులు సుదర్శన్, బాలరాజు, గోవర్ధన్, సింహయ్య ఉన్నారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణంపై డీఎల్‌పీఓ విచారణ

గుండాల మండలం అనంతారం గ్రామపంచాయతీలో విచారణ చేస్తున్న భువనగిరి డీఎల్‌పీవో శ్రీకాంత్‌రెడ్డి

గుండాల, జూన్ 10 : జనావాసాల నడుమ ఫంక్షన్ హాల్ నిర్మించవద్దని మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన సీహెచ్ పద్మలత, పెసరు రేఖారెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో గత నెల 10న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో భువనగిరి డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం గ్రామంలో బహిరంగ విచారణ జరిపారు. ఫంక్షన్ హాల్ నిర్మించే ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన చామల సోమిరెడ్డి జనావాసాల మధ్య ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారని, ఫంక్షన్ హాల్‌తో శబ్ద కాలుష్యంతో ప్రజలు ఇబ్బంది పడతారని, పక్కనే ప్రభుత్వ పాఠశాల సైతం ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామస్తులు డీఎల్‌పీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ఇండ్ల మధ్య ఫంక్షన్ హాల్ నిర్మాణం చేయకూడదని వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపినట్లు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొంగు శ్రీశైలం, ఇన్‌చార్జి ఎంపీఓ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, నాయకులు కుమ్మరికుంట్ల రాజారత్నం, బాశెట్టి యాదగిరి, సోమ నర్సయ్య, బొట్ల లక్ష్మీనర్సయ్య, ఇట్టబోయిన రాములు, బాబుల్, చామల సోమిరెడ్డి పాల్గొన్నారు.

6 గ్యారెంటీల దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి

● బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్

భువనగిరి అర్బన్, జూన్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు పాత మున్సిపల్, కొత్త మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక ఆన్‌లైన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం స్పందించిన అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

వినతిప్రతం అందజేసిన వారిలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తాడూరి భిక్షపతి, సురేశ్, సురపంగ సుభాశ్, హరికిషన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా వేడుకలు

వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, డాక్టర్లు

బీబీనగర్, జూన్ 10 : అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎయిమ్స్ బీబీనగర్ వైద్యులు పాల్గొన్నారు. 'మహిళా సాధికారతలో యోగా పాత్ర' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా మహిళలను శక్తివంతం చేయడానికి, శారీరక, మానసిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక శ్రేయస్సు కలిగి ఉండేందుకు ఒక సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. యోగా కమిటీ ఇన్‌చార్జి డాక్టర్ వందన, నీరజ, డాక్టర్లు బిబిన్ వర్గీస్, గోవిందరావు, లక్కిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, డైరెక్టర్ రాఖీ హాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టాలి

● సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం) సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం), జూన్ 10 : గ్రామీణ వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్, స్టేట్ కౌన్సిల్ పేరిట చేపడుతున్న తనిఖీలు, దాడులను అరికట్టాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండలాధ్యక్షుడు వంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన వైద్యుల సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రాజయ్య, మల్లేశ్, అంజిరెడ్డి, నాగరాజు, దేవదాసు, నరహరి, గంగాధర్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● రామన్నపేట తాసీల్దార్ కార్యాలయం ఎదుట మత్స్యకారుల ధర్నా

రామన్నపేట, జూన్ 10 : రామన్నపేట పెద్ద చెరువును ఆక్రమిస్తున్న వారిపై అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కందుల హన్మంత్ డిమాండ్ చేశారు. చెరువు ఆక్రమణలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక మత్స్యకారులు సోమవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు భూమిని సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, డైరెక్టర్లు కందుల శ్రీను, రేపాక రాజు, యాట ఇస్తారి, మహిళా కార్యదర్శి కందుల కళమ్మ, యాదగిరి, రాములు, హరీశ్, చినమల్లయ్య, పద్మ, అనసూయ, వెంకన్న, మణికంఠ, సైదులు, మణి, శ్రీకాంత్, సత్తయ్య, వెంకటేశం, సత్తెమ్మ పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఆర్థిక అక్షరాస్యత మండల కో ఆర్డినేటర్ విశ్వనాథ్

రంగాపూర్ గ్రామస్తులకు ఆర్థిక మోసాల గురించి వివరిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కో ఆర్డినేటర్ విశ్వనాథ్

బొమ్మలరామారం, జూన్ 10 : సైబర్ మోసాలతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత మండల కో ఆర్డినేటర్ ఎల్లబొయిన విశ్వనాథ్, ప్రజా సంఘాల మండల కన్వీనర్ మైలారం జంగయ్య సూచించారు. సోమవారం మండలంలోని రంగాపూర్‌లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కీసర ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ ద్వారా ఓటీపీ, ఆధార్ నంబర్ అడిగి బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును దొంగిలిస్తున్నారని అన్నారు. ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కు చిన్న వయసు నుంచే పొదుపు చేస్తూ పెద్ద ఆర్థిక లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండి పొదుపు ప్రయోజనాలను పొందాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే నష్టపరిహారం కోసం ఫిర్యాదు చేసేందుకు బ్యాంక్ ఖాతాదారులు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. బ్యాంక్‌లపై అవగాహన కల్పించేందుకు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, నర్సింహ, మల్లేశ్, భార్గవి, లావణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొడుగు నీడన వ్యాపారం..

ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని బక్క మల్లయ్యకుంటలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. వివిధ మండలాల నుంచి చిరువ్యాపారులు పండ్లు అమ్ముకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. వ్యాపారం చేసే క్రమంలో ఎండ నుంచి రక్షణ పొందేందుకు ఇలా గొడుగులు పెట్టుకోవడం కనిపించింది.
-ఆత్మకూరు(ఎం), జూన్ 10

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

● దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

చౌటుప్పల్, జూన్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా దివ్యాంగులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో తుంగ భూపాల్ రెడ్డి, ఏర్పుల శివయ్య, సంజీవ, శంకర్, యాదగిరి, నర్సిరెడ్డి, యాదమ్మ, రాములు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మౌలిక వసతులు కల్పించాలి

● తాసీల్దార్‌కు లబ్ధిదారుల వినతి

తాసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 10 : భువనగిరి పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించాలని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల ఆధ్వర్యంలో సోమవారం తాసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇండ్లల్లో మంచినీరు, కరెంటు, డ్రైనేజీ, రోడ్లకు మరమ్మతులు కల్పించి గృహప్రవేశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు చేగూరి సుధాకర్, కొత్త సత్యం, శంకర్, శివశంకర్, మంజుల, శ్రీదేవి, రేవతి, బద్రీ, రచ్చ సాయిభాస్కర్, అజార్, రోహిణి, రవి, శశిరేఖ పాల్గొన్నారు.

బ్లాక్ బెల్టులు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

కరాటేలో చౌటుప్పల్ విద్యార్థులకు బ్లాక్ బెల్టులు

చౌటుప్పల్, జూన్ 10 : చౌటుప్పల్ పట్టణానికి చెందిన బండ అనిశ్‌రాజు, బైకాని భవానీ కరాటే పోటీల్లో బ్లాక్ బెల్ట్‌లు సాధించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన టైగర్స్ కంగుపూ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బెల్టులు కైవసం చేసుకున్నారు. సోమవారం కరాటే మాస్టర్లు ఎం.శ్రీనివాస్, మునుకుంట్ల శివ, వడ్డేపల్లి అనిల్ విద్యార్థులను అభినందించారు.

పాఠశాలలకు పుస్తకాల అందజేత

భూదాన్‌పోచంపల్లిలో పాఠశాలకు పుస్తకాలు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 10 : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను ఇన్‌చార్జి ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించడంతోపాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మండలంలోని 21 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 8 హైస్కూల్స్, ఒక కేజీబీవీ, ఒక మోడల్ స్కూల్‌లో మొత్తం 2,903 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఈ నెల 12న జత యూనిఫాం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు కృష్ణజ్యోతి, శైలజ, ఎల్ డీఏ శ్యామల, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భూదాన్‌పోచంపల్లి : బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 10 : అనారోగ్యంతో మృతి చెందిన చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. మండలంలోని గౌస్‌కొండలో వాకిటి జంగారెడ్డి బాల్యమిత్రుడు కొయ్యడ నర్సింహ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండడంతో వారి భవిష్యత్ కోసం వాకిట లక్ష్మమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50వేలు, ఫకీరు లావణ్యాదేవేందర్‌రెడ్డి రూ.25 వేలు, కరీంనగర్ వా